క్లుప్తంగా

వరసిద్ధునికి నగదు విరాళం



విరాళం అందజేస్తున్న కుటుంబీకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యఅన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఓ కుటుంబ సభ్యులు నగదు విరాళంగా అందించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన హిమబిందు, రామకృష్ణ రూ.ఒక లక్ష నగదును ట్రస్టుకు అందజేశారు. ఆ నగదు అందుకున్న ఆలయ సిబ్బంది దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

వేడుకగా ముత్యాలమ్మ జాతర



నగర వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం తేనబండలోని శ్రీ ముత్యాలమ్మ జాతర శుక్రవారం వేడుకగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌ను అలంకరించి పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు పళ్లెం, కర్పూర హారతులు పట్టి వేడుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

19న వాహనాల బహిరంగ వేలం

తవణంపల్లె: మండలంలోని వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 19వ తేదీ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఒక ఐషర్ వాహనం, ఒక కారు, ఏడు మోటార్ సైకిళ్లకు బహిరంగ వేలం పాట జరుగుతుందన్నారు. చిత్తూరు అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు అదే రోజు ఉదయం 10 గంటలకు సంబంధిత రుసుం చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఏఈఓ మృతికి సంతాపం

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వ్యవసాయశాఖ మండల విస్తరణాధికారి సాదరయ్య, అదే గ్రామానికి చెందిన రైతు రాజేంద్రనాయుడు మృతి చెందారు. సమాచారం అందుకున్న ఏఓ చిట్టిబాబు, పలువురు వ్యవసాయశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సాదరయ్య, రాజేంద్రనాయుడు మృతికి సంతాపం తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం : యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు జూన్ 21 వరకు యోగాపై గ్రామాల్లో ప్రజలు, యువకులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు.

అందని విత్తనాలు.. తప్పని అవస్థలు

- గతేడాది వేరుశనగ పంట నేలమట్టం
- ఈసారి సాగుకు విత్తన కష్టం
- అరకొరగా పంపిణీ చేస్తున్న వైనం
- విత్తనం కోసం రోడ్డెక్కుతున్న రైతులు



సచివాలయం వద్ద వేరుశనగ విత్తనాల కోసం క్యూకట్టిన రైతులు

కాణిపాకం: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగు కష్టతరంగా మారుతోంది. సీజన్‌కు తగ్గట్టు ప్రభుత్వం చేయూత కనుమరుగవుతోంది. కర్షకులపై కూటమి కక్షకట్టి రైతులను నట్టేట ముంచేస్తోంది. గతేడాది వేరుశనగ పంట నష్టాన్ని గాలికొదిలేసింది. ఈసారి ఖరీఫ్ ప్రారంభంలోనే విత్తన కష్టాన్ని తెచ్చి పెట్టింది. ఖరీఫ్ రైతులు విత్తనం అందక పడరానిపాట్లు పడుతున్నారు. రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా అధికారులు సర్దుబాటు చేసి తల దాచుకుంటున్నారు. ఈ గోడును నేడు(శనివారం) జిల్లాకు వస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు పట్టించుకోవాలని పలువురు రైతులు మొరపెట్టుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో 90వేల మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేస్తారు. ఇందుకు గాను గతేడాది ప్రభుత్వం 40,338 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సరఫరా చేసింది. ఒక్కో రైతుకు 1 నుంచి 3 బ్యాగుల చొప్పున 86,290 మంది రైతులు కాయలను అందించింది. ఈ సారి వ్యవసాయశాఖ అధికారులు వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం 35,238 హెక్టార్లుగా ప్రకటించారు. ఈ మేరకు తొలుత 40,338 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు అవసరమని ప్రతిపాదనలు పంపారు. అయితే ఇందులో ప్రభుత్వం కోత విధించింది. 26,350 క్వింటాళ్ల కాయలను మాత్రమే కేటాయించింది. ఈ అరకొర విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది అనేక ఒడిదుడుకుల నడుమ పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రైతులు సిబ్బందితో గొడవలకు దిగుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఏదో ఒకటి నచ్చచెప్పి పంపించేస్తున్నారు. మరికొన్ని చోట్ల సర్దుబాట్లు ఫలించక గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు 21,639 క్వింటాళ్ల విత్తనాలను 53,743 మంది రైతులకు అందజేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.



విత్తనాల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

పరిహారం ఇవ్వరూ..

గతేడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టార్లు కాగా 13,044హెక్టార్లల్లో పంట సాగులోకి వచ్చింది. అయితే వర్షం కరుణించక పండించిన పంట పూర్తిగా దెబ్బతింది. పరిశీలనకు దిగిన వ్యవసాయ శాఖ అధికారులు 9వేల హెక్టార్లల్లో మాత్రమే పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. 24,342 మంది రైతులకు గాను రూ.15.42 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ మేరకు ప్రభుత్వం గుడిపాల, పెనుమూరు, యాదమరి మండలాలను అత్యంత కరువు మండలాలుగా ప్రకటించింది. మరో 13 మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనవరి 8న కేంద్ర బృందం యాదమరి, గుడిపాల మండలాలను సందర్శించి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులతో ముఖాముఖి నిర్వహించింది. మిగిలిన మండలాల్లో కూడా వేరుశనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారికి ఈ విషయంలో వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వం చేతులెత్తేసింది. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం ఇంతవరకూ పట్టించుకోలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు పరిహారం ముట్టకపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. పరిహారం ఇవ్వకపోతే రోడ్డెక్కడం ఖాయమని రైతులు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

చిత్తూరు కార్పొరేషన్: పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలన్న చంద్రబాబు కుటిల రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు వంటిదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్రాక్షయణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమంగా కొమ్మినేని శ్రీనివాస రావును అరెస్టు చేసిన విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని చీవాట్లు పెట్టిందన్నారు. ఎల్లోమీడియా వార్తల ద్వారా ప్రజలను మోసం చేయాలన్న బాబు అబద్ధపు ప్రచారాలకు అడ్డుకట్ట వేసినట్లు అయిందన్నారు. నిజాలను బహిర్గతం చేస్తున్న సాక్షి కార్యాలయాలపై కూటమి నాయకులు చేసిన దాడులు హేయమైనవన్నారు.

18న పడిపూజ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్‌లో వెలసిన శ్రీ శాస్తాగిరి అయ్యప్ప స్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం 5.30 గంటలకు పునఃప్రారంభించినున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిథున మాస పూజ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ రాత్రి 8 గంటల వరకు ఆలయం తెరచి ఉంటుందన్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి 7 గంటలకు పడిపూజ నిర్వహిస్తామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పేద ప్రజల ఆరోగ్యం కోసం కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కేశవులనాయుడు తెలిపారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. విజయం డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

తవణంపల్లె ప్రగతిపై దృష్టి సారించాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి, మౌనం పాటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు

తవణంపల్లె: మండల ప్రగతిపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విమానం కూలిన సంఘటనలో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులు, ఆలస్యంగా మండల మీట్‌కు వచ్చిన అధికారులపై మండిపడ్డారు. మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడంపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ మండలంలో చౌకదుకాణాల ద్వారా రేషన్ కార్డులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మండలంలో శ్మశానం లేని గ్రామాలకు స్థలం కేటాయిస్తామన్నారు. రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలనే కోసి ఫ్యాక్టరీలకు తరలించాలని మామిడి రైతులకు సూచించారు. ఫ్యాక్టరీకి కాయలు తోలిన రైతులు తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని ఎగువ తవణంపల్లె ఎంపీటీసీ ఇంద్రాణి కోరారు.

ఈకేవైసీ చేసుకుంటేనే..

మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి వందన మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి అందుతుందని పేర్కొన్నారు. రైతులకు సౌకర్యంగా రైతు సేవా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంఈఓ హేమలత మాట్లాడుతూ తల్లి వందనం అమలు కాని విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపల అభ్యంతరాలు తెలపాలన్నారు. ఉపాధి ఏపీఓ బాల మాట్లాడుతూ మామిడికి ప్రత్యామ్నాయంగా పండ్లతోటలు పెంచేందుకు అవకాశం ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీత్ మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా వాటర్ ట్యాంకులు 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ కొత్తగా పక్కాగృహాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ 50 శాతం రాయితీతో దాణా సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు శోభారెడ్డి, అనసూయమ్మ, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తదితరులు

తవణంపల్లె: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి తెలిపారు. రక్తదాన శిబిరాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ పర్యవేక్షించి కళాశాల యాజమాన్యంను అభినందించారు. 21 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని మరొకరి ప్రాణాన్ని కాపాడటానికి స్వచ్ఛందంగా రక్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో రక్త నిల్వ కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ అమర్‌నాథ్, అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.ఆర్. మాలతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

చిత్తూరు కార్పొరేషన్: చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు లెక్కలేనన్ని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు చేతివృత్తి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఇటీవల 18 రకాల వృత్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేశారు గానీ వాటికి నిధులు మంజూరు చేయలేదన్నారు. గొర్రెల మేకల పెంపకానికి ప్రోత్సాహాలు ఇవ్వాలని గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. భూమి, నీటి సౌకర్యం, మందులు, రుణసదుపాయం, బీమా కల్పించాలన్నారు. అనంతరం చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా రఘును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, నాయకులు పాల్గొన్నారు.

నిత్య యోగాతో ఆరోగ్య సిద్ధి



చిత్తూరు డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): యోగాతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాచార్యులు ఉద్యోగులకు ఆసనాలు వేసి చూపించారు. ఆసనాలపై పట్టు పెంచుకోవాలని ఉద్యోగులకు తెలియజేశారు. తద్వారా జరిగే మానసిక, శారీరక, ఆరోగ్య లాభాలను వివరించారు. కార్యక్రమంలో శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిని బలి తీసుకున్న అతివేగం

బంగారుపాళెం: అతివేగం ముగ్గురిని బలి తీసుకుంది. పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన రైతు, వాకింగ్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగి ఇద్దరూ కాసేపటికే విగత జీవులయ్యారు. మండలంలోని తిమ్మోజుపల్లెలో శుక్రవారం ఉదయం వాకింగ్ చేస్తున్న వారిని హఠాత్తుగా వచ్చిన కారు కబళించేసింది. రెండు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. రోడ్డుపై వెళుతున్న కారు, పక్కనున్న సర్వీసు రోడ్డులో వెళుతున్న వారిని ఢీకొట్టి, ఆ తరువాత పల్టీలు కొట్టుకుంటూ మామిడితోటల్లోకి దూసుకెళ్లింది. పలమనేరు నుంచి చిత్తూరుకు బయల్దేరిన కారు నుజ్జు నుజ్జయిన తీరును చూస్తే అది ఎంత వేగంగా వచ్చిందో, ప్రమాదం ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తుంది. రైతు సంఘం నాయకుడిగా రాజేంద్రనాయుడు స్థానికులందరికీ సుపరిచితులు. అదేవిధంగా వ్యవసాయ విస్తరణాధికారిగా సాదరయ్య అందించిన సేవలను గ్రామస్తులు ఎప్పటికీ మరువలేరు. ఒకే గ్రామంలో రెండు కుటుంబాల్లో చావు డప్పు మోగడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది. అదే కాస్త నెమ్మదిగా ప్రయాణించి ఉంటే కారులో ఉన్న వారు కాస్త ఆలస్యమైనా గమ్యం చేరి ఉండేవారు. అనుకున్న పనులన్నీ సజావుగా జరిగిపోయేవి. ఈ కారుకు కానీ, కారులో ఉన్న వారికి గానీ ఎలాంటి సంబంధం లేని రెండు కుటుంబాలకు పెద్దదిక్కు మిగిలేది. మృత్యువు ఎక్కడి నుంచి వస్తుందో ఎలా వస్తుందో ఎవరూ చెప్పలేరు. కానీ అతి వేగం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నది వాస్తవం.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: పేదలకు ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్నట్లు స్థానిక వైద్యాధికారి కేశవనారాయణ తెలిపారు. మండలంలోని ఉప్పాంకలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలందించడానికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భవతులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని తప్పక భుజించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి కాయల మార్కెట్ అస్తవ్యస్తం



వర్షానికి జలమయంగా మారిన మార్కెట్ యార్డ్



మార్కెట్ యార్డులోకి వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న పైపులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మామిడి కాయల మార్కెట్ యార్డు అస్తవ్యస్తంగా తయారైంది. ప్రైవేటు కార్యకలాపాలకు అడ్డంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు మార్కెట్ యార్డు స్థలాన్ని స్టాక్ పాయింట్‌లా ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో సీజన్ సమయంలో ఇబ్బంది తప్పడం లేదని ట్రేడర్లు వాపోతున్నారు. ప్రస్తుతం మామిడి కాయల మార్కెట్‌లో మామిడి వ్యాపారం పుంజుకుంది. రోజుకూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రాకపోకలకు అక్కడక్కడ దింపిన భారీ పైపులు ఇబ్బందికరంగా మారాయి. ఈపైపులను దింపి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. అడిగినప్పుడల్లా కాంట్రాక్టర్ అదిగో..ఇదిగో అంటూ సాకులు చెబుతున్నారని వ్యాపారులు అసహనానికి గురవుతున్నారు. దీని కారణంగా మామిడికాయల లోడింగ్‌తో వచ్చే వాహనాలు ఇబ్బందికరంగా మారాయి. కొన్ని దుకాణాలకు అడ్డంగా ఉన్నాయి. దీంతో వారికి వ్యాపారం సరిగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈపైపులను ఇక్కడి నుంచి వేరే చోటకు మార్పు చేసేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

మురుగుకు మార్కెట్ ఆవాసం

వర్షం పడితే మార్కెట్ యార్డు స్థలం చిత్తడవుతోంది. తేలిక పాటి వర్షానికి జలమయంగా మారుతోంది. బలమైన వర్షానికి చెరువును తలపిస్తోంది. ప్రధానంగా నగరంలోని మురుగునీరు మార్కెట్ యార్డు స్థలంలోకి చేరుతోంది. వర్షం పడితే మురగంతా నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు విస్తరించడంతో ఈ ఉధృతి మరింత ఎక్కువైందని వ్యాపారులు వాపోతున్నారు. మురుగు దాటికి వ్యాపారాలు చేయలేకపోతున్నామని చెబుతున్నారు.